
కథ

# వయసు ముందుకీ మనసు వెనక్కి...

ఇంద్రగంటి జానకీబాల



**బస్సు వచ్చి ఆగేసరికి అక్కడ కూర్చుని ఎదురు చూస్తున్నవాళ్ళంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. కేరింతలు కొట్టారంటే అందరూ వేగంగా కదిలి బస్సెక్కేందుకు పరుగులు తీశారనుకుంటున్నారా? అబ్బే! అదేం లేదు. ఉత్సాహం వురకలు వేస్తున్నా అంతా అతి నెమ్మదిగా లేచి బట్టలు, బూట్లు సర్దుకుంటూ అడుగులో అడుగేస్తూ కదలడం మొదలుపెట్టారు. వాళ్ళంతా ఎక్కేవరకు బస్సు కదలదనే ధైర్యమే కాదు అక్కడున్న అసలు సంగతి. వారంతకంటే మించి చకచకా పరుగులు పెట్టే శక్తి వున్నవారు కాదు. నెల్లాళ్ళుగా పథకాల మీద పథకాలు వేసుకుని స్త్రీలంతా ఒక బస్సు కట్టుకుని ఒక విహార యాత్రకి, లేదా ఒక విజ్ఞానయాత్రకి లేదా రెండూ కలిసిన ఒక విలాస యాత్రకి వెళ్దాం అని నిర్ణయించుకున్నారు.**

ఇళ్ళల్లో చాకిరీతో, బరువు బాధ్యతలతో విసుగెత్తి పోయిన వాళ్ళకి ఆ ఊహ ఒక పిల్లతెమ్మెరలా అనిపించింది. సెల్‌ఫోన్ల మీదే ప్రోగ్రామంతా రూపొందించేసుకుని ఇళ్ళనుంచి పొలోమంటూ బయటపడ్డారు. అందరూ తమకేదో స్వేచ్ఛ కొత్తగా వచ్చిన భావనతో ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు.

పాఠశాల నుంచి మైదానంలోకి ఒక్కసారిగా పిల్లలు పరుగులు తీసినట్టు వారు కదులుతున్నారు. కొందరు చిలకల్లా ఎగిరితే కొందరు పావురాళ్ళు, కొందరు పిచుకలు, మరికొందరు పాలపిట్టలు, ఇంకా కొందరు మైనాలుగా ఆకాశ విహారం చేస్తున్నట్లు చలించి పోతున్నారు.

ఆ సమూహంలో ముప్ఫై అయిదేళ్ళ మున్నా నించి మొదలుపెడితే, నలభై, నలభై. అయిదు - యాభై, యాభై అయిదు - అరవై, అరవై అయిదు - డెబ్బై, డెబ్బయి అయిదేళ్ళ ముత్తులక్ష్మి వరకు అన్ని వయసులవాళ్ళూ వున్నారు. యాభైలోపు వారందరూ సీనియర్ సిటిజన్ల బాధ్యత తీసుకున్నట్లు భావించి జోరుగా పెత్తనం చెలాయించేస్తున్నారు. అయితే వయసు మీద పడిన వాళ్ళేం తక్కువ తిన్నారా, వాళ్ళ పెద్దరికం పేరు చెప్పి చిన్నవాళ్ళని సతాయించి వదిలేస్తున్నారు.

అలాంటి ఒక మిశ్రమ సమ్మేళనంలో వున్న ఆనందం, ఆహ్లాదం, అంతా యింతాకాదు. ఎవరేమన్నా ఎవరూ పట్టించుకోరు. అన్నీ చిరునవ్వులు,


చమత్కారాలు, గడుసు ప్రేమలు, సొగసు వగలు.

ఇన్నాళ్ళకి అందరం యిలా కలిసి స్వేచ్ఛగా నవ్వుతూ, తుళ్ళుతూ వెళ్తున్నామనే ఆనందమే తప్ప మరోటి లేదు.

జుట్టు నెరిసినవాళ్ళు చాలామందే వున్నప్పటికీ, నెరిసిన జుట్టును కనిపించకుండా జాగ్రత్త పడినవారే ఎక్కువ. మైసూరు సిల్కు చీరలు, గద్వాలు నూలు చీరలు, కంచి పట్టుచీరలు, బెంగాల్, వెంకటగిరి చట్టి నాడు, చెరిగల్పట్టు కాటన్ చీరలు రంగురంగుల అందాలతో కరకర, మిసమిస కదులుతూ, తళతళ మెరుస్తూ - అందరూ కదిలి నడుస్తుంటే పూలరథం కదిలినట్లుంది.

కొన్ని చుడీదార్లు - మరికొన్ని పంజాబీ దుస్తులు ఇంకా కొన్ని జీన్స్ కాటన్ టాప్స్‌తో ఆ సమూహం పాత కొత్తల మేలు కలయికలా కళకళలాడిపోతోంది.

రుక్మిణీదేవి నెమ్మదిగా బస్సు ఎక్కింది. పైనున్న రత్న చెయ్యి పట్టుకుని సాయం చేసింది. బస్సు



సీటులో కూలబడి ఆయాస పడింది రుక్మిణి.

''ఏమే రుక్కూ! ఎన్నాళ్ళకే మన కోరిక తీరింది. ముఖ్యంగా నువ్వు రావడం ఎంతో బాగుంది నాకు'' అంది సక్కూబాయి.

''నాకూ బాగుందే సక్కూ'' అంది రుక్మిణి

''ఏమిటీ నేను రావడమా – నువ్వు రావడమా'' అంటూ భుజంమీద గట్టిగా చరిచింది.

''నేను రావడమే'' అంది రుక్కు కొంటెగా

''చూశావా! అన్యాయం. నాకు నువ్వు రావడం ఆనందంగా వుందీ అంటే నువ్వూ అలాగే అనాలి కదే'' అంది బుంగ మూతిపెట్టి సక్కుని చూసి రుక్మిణి నవ్వింది.

''ఇల్లు – వంట – మొగుడు, పిల్లలు – అత్తగారు – చెత్తగోల లేకుండా హాయిగా, స్వేచ్ఛగా వచ్చేస్తే ఎంత బాగుంది'' అంది సావిత్రి విశ్రాంతిగా వెనక్కి వాలి.

''బాగా చెప్పారు సావిత్రిగారూ! పాల ప్యాకెట్లు వచ్చాయా – పనిమనిషి ఇంకా రాలేదేం చెప్మా – పెందరాళే వంట మొదలు పెడదామంటే ఒక్క కూర యింట్లో వుండి చావదు అంటూ వెధవగోల లేకుండా భలే వుంది'' అంటూ సావిత్రికి వంత పాడింది గాయత్రి.

''అమ్మో నన్ను కరిచాడు – కరిచాడు – చచ్చేట్టు కరిచాడు'' అంటూ అరిచింది గంగ.

''ఏమిటీ ఏమిటీ'' అంటూ అంతా కంగారు పడ్డారు.

''ఇదిగో చూడండి చెప్పు కరిచి మంటతో చస్తున్నా'' అంది గంగ.

''చెప్పు కరిచింది అనకుండా కరిచాడు అంటావేమిటి'' అంటూ అమాయకపు ముఖం పెట్టింది అనసూయ.

''కరిచే దేనికైనా నేను 'డు' చేరుస్తాను. అది అంతే. అందుకే చెప్పు కరిచాడు అంటాను. అన్నాను'' అని వివరించింది గంగ. అందరూ ఆనందంగా చప్పట్లు కొడుతూ జయజయ ధ్వానాలు చేశారు. సందడికి బస్సు మొత్తం కదిలిపోయింది.


''ఇది చాలా అన్యాయం'' అన్నారెవరో –

''ఎవరికి తల్లీ అన్యాయం'' అంటూ వ్యంగ్యం రంగరించిన ఆక్షేపణ.

''అందరూ వచ్చినట్టేనా'' అంటూ మున్నా అరిచింది.

''వచ్చినవాళ్ళంతా వచ్చినట్టే – రానివాళ్ళు ఇక్కడుండరుగా'' అందొక కంఠం అతి తెలివిగా.

ఢాం అని తలుపు మూసి డ్రైవరుకి సాయంగా వచ్చిన క్లీనర్ ముందుకెళ్ళి కూర్చున్నాడు.




''మన సమాఖ్య జిందాబాద్ – అవును జిందాబాద్ – మన స్నేహం జిందాబాద్ – మరే మరే జిందాబాద్'' – ఒకటే అరుపులు, కేకలు, నవ్వులు, ఈలలు – వారి ఆనందం బస్సు టాపుని దాటి ఆకాశాన్ని అంటుకుంది.

''పోనీ బండి పోనీ బావా – ఇదేనోయి త్రోవా'' – అంటూ గంగ పాటందుకుంది.

''నడపవా సఖా – నావ నడపవా' సావిత్రి గొంతు ఎత్తింది.

''ఉష్ ఉష్ ఏమిటా పాటలు అసయ్యంగా'' అందొక కంఠం.

''అసయ్యం ఏముందమ్మా? నాకెంతో సంతోషంగా వుంది. నేనేదైనా పాడతాను'' అంది దానికి జవాబుగా.

అంతే అందరూ తలొకపాట అందుకున్నారు.

''చెల్ రే బేటా చల్ –
షికారు పోయి చూదమా''

''జోరుగా – హుషారుగా షికారు పోదమా'' అంటూ అందరూ తలోవైపు, తలో శ్రుతిలో, గట్టిగా పాటలందుకున్నారు. ఇంతలో ఎవరో ''ఓ బాటసారీ – ఇది జీవిత రహదారి'' అంటూ సాగదీస్తున్నారు.

మరొకరు ''హోరుగాలిలో గాలివానలో పడవప్రయాణం'' అంటూ పైనెత్తుకున్నారు.

''ఛీ! ఆపండి. సమయం – సందర్భం చూడాలి కదా – చక్కని పాటలు పాడండి'' అంటూ గొంతు చించుకుంది గాయత్రి.

ఇంతలో సక్కు సెల్ మోగింది. హడావిడిగా బ్యాగ్‌లో వెదికి ఫోను పట్టుకుని 'హల్లో' అంది – ''ఊ... ఇప్పుడే బయలుదేరాం – చేరగానే చేస్తా... ఆ... ఏమిటీ... వినిపించటం లేదు... ఆ... బొత్తిగా వినిపించటం లేదు. సరే... చేరినవెంటనే చేస్తాలెండి'' ఫోను పెట్టేసింది సక్కు.

''ఏయ్ సక్కూ... ఎవ్వరూ ఫోన్లు తెచ్చుకోవద్దు. ఇంటినుంచి దూరంగా మూడు రోజులుందాం అనుకున్నాం కదా'' అంది రుక్మిణి.

''అలాగని నువ్వు సెల్ తేలేదా!'' ఆశ్చర్యంగా అంది సక్కు.

''అసలు నాకు లేదు. మావాళ్ళు యిస్తానన్నా మనం వద్దనుకున్నాం కదాని వద్దుగాక వద్దని తేలేదు''

''అయ్యో! పిచ్చి రుక్కూ – సెల్ లేకపోతే ఎలా బతుకుతామే పోనీలే – నా సెల్ కావలిస్తే తీసుకుందువుగానిలే''

''వద్దులే'' అనేసి రుక్మిణీ దేవి ఆలోచనలో పడింది. ఈ ప్రయాణానికి ముందు ఇంట్లో జరిగిన వాద వివాదాలు గుర్తుకొచ్చాయి.

రాఘవరావు ఈ విహార యాత్ర ఫిక్స్ అవగానే ''సెల్ నీతో పట్టుకెళ్ళు. ఎప్పుడు నువ్వు మాట్లాడాలన్నా అందుబాటులో వుంటుంది'' అన్నాడు. అప్పటికే అందరూ సెల్‌ఫోన్లు తీసుకువెళ్ళద్దని నిర్ణయించుకోవడం వల్ల ''ఏం అవసరంలేదు. మూడురోజుల్లో కొంపలేం మునిగిపోవు'' అంది.

''అదేమిటి – నువ్వెక్కడున్నావో మాకూ తెలుస్తుంది. నువ్వేదైనా చెప్పాలన్నా వీలవుతుంది'' అన్నాడు.

''ఫోను వుంటే మాత్రం చెప్పాలనేముంది? మొన్న మీరు సుప్రీం కోర్టు పనిమీద ఢిల్లీ వెళ్ళినపుడు రోజున్నర ఫోను చెయ్యలేదు – ఫోను చేతిలోనే వుందిగా'' అంటూ రుసరుసలాడింది రుక్మిణి.

''ఏదో పనిలో బిజీగా వుండి చెయ్యలేదు'' అన్నాడు.

''నేనూ బిజీగానే వుందామనుకుంటున్నా'' అంది.

''అయితే మరీ మంచిది'' రాఘవరావు తన పనిలో పడిపోయాడు. అపర్ణ వచ్చి ''అదేమిటే అమ్మా! అలా మాట్లాడుతావు. సెల్ పట్టుకెళ్ళు నాదిస్తా'' అంది.

''వద్దులే తల్లీ – నీ ఫ్రెండ్సందర్నీ రిప్లై చెయ్యలేక చావాలి'' –

ఇంట్లో కొడుకు, కోడలు, కూతురు అందరూ ఎంతగా ఇస్తానన్నా వద్దుగాక వద్దంది రుక్మిణి. కారణం ఏమిటంటే ఓ మూడురోజులు ఈ కుటుంబ సంబంధాల నుంచి, ఈ బంధాల నుంచీ ఫ్రీగా, తన కోసం తను, హాయిగా, ఆనందంగా, ఏ బాధ్యతలూ లేకుండా వుండాలనీ – తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుని దూరంగా వుండాలనీ కోరుకుంది – బస్సు కుదుపుకి ఆలోచనల్లోంచి బయట పడింది.

ఎక్కడో ఒకచోట సెల్‌ఫోన్ మోగుతూనే వుంది. రకరకాల రింగ్‌టోన్లు వినిపిస్తూనే వున్నాయి. ఎవరో ఒకరు హల్లో అంటూ మాట్లాడుతూనే వున్నారు. ప్రయాణపు హోరులో అందరూ గొంతులు చించుకుంటూనే వున్నారు.

''ఆ...... ఇప్పుడే బయలుదేరాం – బాగుంది. బస్సు కూడా బాగుంది. మళ్ళీ చేస్తాను''

''బుజ్జిగాడికి దగ్గరుండి అన్నం పెట్టు వదిలేస్తే వాడు తినడు. నీకు బొత్తిగా శ్రద్ధ లేదు – సరేనా''

''ఏమిటీ మీ నాన్నగారు టిఫెను తినకుండా వెళ్ళిపోయారా – అవున్లే ఆయనకి బయట హోటల్లో తినడమంటే మహాయిష్టం. అందుకే నేను మరి అలా వుంటాను – సరేలే. నువ్వేం చేస్తావ్ – నేవచ్చాక చెప్తాలే''

''పనమ్మాయి యింట్లో పని చేసేప్పుడు కూడా వుండు. ఎవ్వరినీ నమ్మలేం. మీరు ఎక్కడి వక్కడే పడేస్తారు. నువ్వూ తమ్ముడూ కాస్త శ్రద్ధగా వుండండి – సరే మళ్ళీ చేస్తా''

ఈవిధంగా రకరకాల సంభాషణలు వింటుంటే రుక్మిణికి చాలా విసుగనిపించింది. వీళ్ళంతా కుటుంబాల గురించి నిరసన ప్రకటించింది కేవలం తాత్కాలికమన్నమాట. బయలుదేరిన రెండు గంటల్లో ఒక్కసారైనా ఇంటికి మాట్లాడని వాళ్ళూ లేరు.

కిటికీలోంచి చల్లటిగాలి ముఖానికి తగిలి హాయిగా, మత్తుగా నిద్ర ముంచుకొచ్చింది.

అందరికీ టిఫెను పొట్లాలు, కాఫీలు, టీలు, కరకరలు, మిఠాయిలు, జాంపళ్ళు కూర్చున్నచోటకే అన్నీ వచ్చి పడుతున్నాయి. కాళ్ళు పట్టేశాయని అంతా ఒకసారి బస్సుదిగి అటూ యిటూ పచార్లు చేసి మళ్ళీ ఎక్కారు. ఒక నిద్ర తీసి లేచారేమో హుషారుగా అంతా కబుర్లలో పడ్డారు.

ఎవరు మాట్లాడినా కుటుంబ సంబంధాలలోని లొసుగులు, భర్త – అత్తగారు – వియ్యపురాలు –

ఆస్తి – రాబడి – పెరిగిన బంగారం ధర – సడన్‌గా పడిపోయిందని చెప్తున్న రియల్‌ఎస్టేట్ – ఆరోగ్య చిట్కాలు.

ప్రతీవాళ్ళు తామెంత క్రమబద్ధంగా వుంటారో చెప్తున్నవాళ్ళే. అందరూ తమకెంత తిండి వ్యామోహం లేదో చెప్పేవాళ్ళే – బస్సంతా గలగల మని గజ్జల గుర్రంలా కదులుతోంది.

"ఏమే రుక్కూ! నువ్వింటికి మాట్లాడతావా? సెల్ యివ్వనా" అంటూ వచ్చింది. మూడుసీట్ల అవతల కూర్చున్న సక్కు.

'వద్దులే' అంది రుక్మిణి. కానీ ఒక్కసారి మాట్లాడితే బాగుండుననిపిస్తోంది. ఆమె మనసు మనవడి మీద కొట్టుమిట్టాడుతోంది. తన మనవడ్ని కోడలు శ్రద్ధగా, సరిగ్గా చూడదని ఆమె నమ్మకం. వాడు అన్నం తిననంటే తిప్పి తిప్పి పెట్టదనీ, కడుపు మాడితే వాడే తింటాడని ఊరు కుంటుందని రుక్మిణికి కోడలిమీద కోపం. ఆమె కన్నతల్లి కూడా, ఎందుకలా వుంటుందని ఎవరైనా అడిగితే, కనినంత మాత్రాన ప్రేమ వుండాలనేముంది? అని ఎదురు ప్రశ్న వేస్తుంది.

బస్సు సడన్‌గా ఆగింది. మట్టిరోడ్డు. ఇరువైపులా లవన్‌డర్, పింక్ పూలు ఆకులు కనిపించినంత ఒత్తుగా పూసేసి వున్నాయి. అందరూ అబ్బ అబ్బ! ఎంత బాగుందీ అంటూ ఆనందంతో కేకలు వేస్తూ బస్సు దిగారు.

మున్నా లేచి నిలబడి అందర్నీ వుద్దేశించి గట్టిగా ఒక ప్రకటన మొదలు పెట్టింది "మనం ఇంకా అడవిలోకి వెళ్తాం. అక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందవు. ఎవరేనా సెల్ మాట్లాడాలనుకుంటే ఇప్పుడే మాట్లాడేసేయండి – మళ్ళీ ఆరుగంటల వరకు వీలుపడదు" –

అంతా బిలబిలమంటూ బస్సు దిగేశారు. సక్కూ, రుక్కు దగ్గరకొచ్చి "రుక్కూ– నువ్వసలు ఇంటికి మాట్లాడలేదుగా – తొందరగా రెండుముక్కలు మాట్లాడేసేయ్ – నీ తర్వాత నేను మాట్లాడతా" అంది.

అప్పటికే రుక్మిణి మనసు యింటి చుట్టూ గిరికీలు కొడుతోంది. వెంటనే అందుకుంది. కూతురు 'అమ్మా' అంటూ అరిచేసరికి ఆనందంతో మనసు పులకించిపోయింది. కొడుకు, కోడలు, భర్త అంతా పలకరించారు. ముద్దుమాటల మనవడు 'బామ్మా' అంటూ దీర్ఘం తీశాడు. ఇంకా మాట్లాడాలని వున్నా, కట్ చేసింది. మరి సక్కూ కూడా మాట్లాడాలి కదా – అని, ఆ మాటే చెప్పింది. సక్కు నవ్వేస్తూ "నేనిప్పటికి రెండుసార్లు చేశా – ఎటొచ్చీ మరీ ఎనిమిది గంటలు సిగ్నల్ అందదనీ"... అంది.

పది నిముషాలు బస్సు జనం కిందకి దిగి – ఎడం చెవికి సెల్ అతికించుకుని పలకరింతలు – అప్పగింతలు – సలహాలు – సంప్రదింపులు – వేళాకోళాలు – వెక్కిరింతలు – జాగ్రత్తలు ఇలా గలగల మాటలు, ఆ బాట పక్క విరగబూసిన పూలతో కలిసి పరిమళించాయి. మళ్ళీ బస్సు నిండుగా కదిలింది. అందరి మనస్సుల్లోనూ ఒక తృప్తి – ఒక ఆనందం –,

రుక్మిణి కిటికీలోంచి చూస్తూ ఆలోచనలో పడింది. స్వేచ్ఛ అంటే ఏమిటి? – అస్తిత్వం అనేదానికి అర్థం ఎలా చెప్పాలి? – జిడ్డు కృష్ణమూర్తి 'నువ్వు' అంటే ఏమిటి – అన్నారు.

నువ్వు అంటే నీ ఆస్తి, నీ కుటుంబం, నీ బంధాలు – నీ ప్రేమలు ఇవన్నీ కలిసే కదా నువ్వు.

అవన్నీ వద్దనుకుని నువ్వు వేరుగా పక్కకి జరగగలిగితే దూరంగా నిలబడి ప్రపంచాన్ని చూడగలిగితే నువ్వో పెద్ద యోగివై పోతావు కదా!

నేను నేనంటూ అనుకుంటున్నది ఎంతవరకు నేను? ఆలోచన తెగకుండా ఆమెని ఒక అనిశ్చిత పరిస్థితిలోకి లాగేస్తోంది.

అడవి మధ్య గెస్ట్ హౌస్ ముందు బస్సు దిగుతుంటే చిత్రమైన భావన –,

మోటారు శబ్దాలు, సెల్‌ఫోన్ల రింగ్‌లు – బస్సు హారన్లు – ట్రాఫిక్ రొదలు – మైకుల భక్తి గోలలు – ఏమీలేవు.

ఉండి ఉండి దూరంగా కోయిల హాయిగా, స్వేచ్ఛగా పాడే సన్నని పాట – మువ్వల్లా మోగే పిట్టల కదలికలు – రకరకాల పక్షుల కలకలలు –

కాళ్ళకింద నలిగే ఎండుటాకుల లయవిన్యాసాలు

మనిషి కోరే స్వేచ్ఛ, ఏకాంతం అంటే వున్న వాతావారణం నుంచి మార్పు మాత్రమేనా?

ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టలేని ఒక బలహీనత నాధారంగా చేసుకుని బ్రతకేయడమేనా.

గత జన్మ చేసుకున్న శ్రుతినాధారంగా జీవన రాగం ఆలపించేయడమేనా!

అన్నీ ప్రశ్నలే –

రుక్మిణి గెస్ట్ హౌస్ ముందు వరండాలో వేసి వున్న సోఫాలో విశ్రాంతిగా కూర్చుని వెనక్కి వాలింది హాయిగా.

★


చిరునామా

ఐ. జానకీబాల,

102, శుభోదయా అపార్ట్‌మెంట్స్,

ఆర్.కె. పురం, సికింద్రాబాద్ - 500 056

ఫోన్ : 040-27794073